# సంపత్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం



సంతాప సభలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి పక్కన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

- ఆయన కుమార్తెకు ఉద్యోగం కల్పిస్తాం
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చారు
- ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

చిల్పూరు, డిసెంబర్ 13 : ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కుటుంబసభ్యులను అండగా ఉంటామని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం రాజవరంలో సంపత్‌రెడ్డి సంతాప సభకు వారు హాజరయ్యారు. పాగాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులు సంపత్‌రెడ్డి, ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్‌లను బీఆర్ఎస్ పార్టీ కోల్పోవడం బాధాకరమన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి ఆర్థికంగా, అండగా పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన కుమార్తెకు ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డితో 14 సంవత్సరాల నుంచి కలిసి పనిచేస్తున్నానని, స్టేషన్‌ఘనపూర్, జనగామ అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ గెలుపొందిన తెల్లారే సంపత్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరం అన్నారు. 2001లో కేసీఆర్ పిలుపుతో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. సంపత్‌రెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనగామ జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు పార్టీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. శాసనసభ మండలి చైర్మన్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య నివాళులర్పించారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి తండ్రి జయపాల్‌రెడ్డి, అన్నదమ్ములు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మారెపల్లి తిరుమలాకృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మారెపల్లి లలితాదేవీశ్యామ్‌కుమార్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ జనగామ యాదగిరి, మాజీ దేవస్థానం డైరెక్టర్ గజ్జెల దామోదర్, తెలంగాణ గౌడ సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపల్లి జగన్నాథం, మండలాధ్యక్షుడు భూక్యా రమేశ్ నాయక్ పాల్గొన్నారు.



వేయిస్తంభాల దేవాలయంలో గౌరీనక్తవ్రతం చేస్తున్న అర్చకులు, హాజరైన మహిళలు

## వేయిస్తంభాల ఆలయంలో గౌరీనక్తవ్రతం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 13 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి ఆలయ నాట్య మండపంలో 21 కిలోల పసుపుతో గౌరమ్మను చేసి పార్వతీదేవిగా అలంకరించి గౌరీనక్తవ్రతం నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, గంగు మణికంఠ శర్మ తెలిపారు. కార్తీకమాసం ముగింపు తెల్లవారి మహిళలు అంతా గౌరీనక్తవ్రతం నిర్వహించుకోవడం ఆనవాయితీ అని, రుద్రేశ్వరునికి నెలరోజుల పాటు ఉపవాసదీక్షల అనంతరం మార్గశిర మాసంలో అమ్మవారిని పూజించుకోవడం సనాతన ధర్మమని వివరించారు. అనంతరం మహిళలకు ఓడి బియ్యం సమర్పించారు.

### కార్తీకమాస ఆదాయం రూ. 3,89,706..

దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకుడు అనిల్, ఈవో వెంకటయ్య పర్యవేక్షణలో నెల రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3,89,706 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు గంగు మణికంఠశర్మ, ప్రణవ్, సందీప్‌శర్మ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

హనుమకొండ/నర్సంపేట, డిసెంబర్ 13 : ఏడో వేతన కమిటీ సిఫార్సులను అమలు చేయాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని హనుమకొండ పోస్టల్ డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమ్మెతే కోట్లాది రూపాయల లావాదేవీలు నిలిచిపోయాయని డివిజన్ అధ్యక్షుడు కొమురారెడ్డి అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐజీడీఎస్‌యూ నాయకుడు ఎండీ షాబుద్దీన్ అన్నారు.




హనుమకొండ : సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

## ఎన్ఐటీకి భూమి కేటాయించాలి : నిట్ డైరెక్టర్

హనుమకొండ, డిసెంబర్ 13 : వరంగల్ ఎన్ఐటీలో నూతన కోర్సుల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్, పరిశోధనల కోసం సుమారు వంద ఎకరాల భూమిని కేటాయించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి కోరారు. బుధవారం కలెక్టర్‌తో నిట్ డైరెక్టర్, ప్రొఫెసర్లు ఉమామహేశ్వర్, సతీశ్‌కుమార్ సమావేశమయ్యారు. ఎన్ఐటీలో సమాజానికి ఉపయోగపడే సాంకేతిక, పరిశోధనలు సాగుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఈ-వెహికల్స్‌ను తయారు చేసినట్లు తెలిపారు. అలాగే నూతనంగా అగ్రికల్చర్ ఇంజినీరింగ్, రైల్వే ఇంజినీరింగ్ కోర్సులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని, దీని కింద గ్రామాలను దత్తత తీసుకుంటే ఎన్ఐటీ మార్గనిర్దేశం చేస్తుందన్నారు. కాగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, డీఆర్వో వైవీ గణేశ్, ఆర్డీవో రమేశ్, ఈఈ రాజయ్య, డీఈ సంతోష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

## కేసీఆర్‌ను పరామర్శించిన పలువురు నేతలు

చిల్పూరు, డిసెంబర్ 13 : హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను స్టేషన్‌ఘన్‌పూర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బుధవారం కలిసి పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఉన్నారు.








## కనుచూపు మేర పసిడి పంట..

శాయంపేట : భూమికి బంగారు రంగేశారా అన్నట్లు కనిపిస్తున్నది ఈ చిత్రం. కేసీఆర్ పాలనలో పుష్కలంగా సాగు నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడంతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పడావు భూములు సైతం సాగులోకి వచ్చాయి. శాయంపేట మండలం పత్తిపాక శివారులో ఎక్కడ చూసినా కోతకు వచ్చిన వరి పంట బంగారు వర్ణంతో మెరుస్తూ కనువిందు చేస్తున్నది.



కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

## కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- ఒక్కరోజే 38 వేల బస్తాల రాక

కేసముద్రం, డిసెంబర్ 13 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ధాన్యం పోటెత్తింది. రికార్డు స్థాయిలో ఒక్క రోజే 38వేల బస్తాల ధాన్యం విక్రయానికి వచ్చింది. యార్డులన్నీ వడ్లతో నిండిపోయాయి. ఆర్ఎన్ఆర్ రకం క్వింటాల్ ధాన్యం గరిష్ఠంగా రూ. 3275, కనిష్ఠంగా రూ. 2560, హెచ్ఎంటీ ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 3236, కనిష్ఠంగా 1759, జైశ్రీరాం ధాన్యం క్వింటాల్‌కు రూ. 3302, కనిష్ఠంగా రూ. 2900 పలికింది. పరిమితికి మించి ధాన్యం రావడంతో గురువారం మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు చైర్‌పర్సన్ నీలం సుహాసిని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

